క్లుప్తంగా

సేంద్రియ ఎరువు తయారు చేయాలి



షెడ్డు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శివకృష్ణ

తానూరు: పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి.. సేంద్రియ ఎరువు తయారు చేయాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని బెల్‌తరోడా గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలను రక్షించి వందశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శి అశ్వినికి సూచించారు. వారి వెంట సర్పంచ్ సాయినాథ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు ఏఎంసీలో కొనుగోళ్లు బంద్

భైంసాటౌన్: భైంసా వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం పంట ఉత్పత్తుల కొనుగోళ్లు(భూసార్ బీట్) నిలిపేయనున్నట్లు ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి అడెల్లు ఒక ప్రకటనలో తెలిపారు. అమావాస్య నేపథ్యంలో కార్యాలయానికి సెలవు ఉంటుందని.. రైతులు, ఏజెంట్లు, వ్యాపారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



సభ్యులకు విరాళం అందిస్తున్న పూజారి

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి సోమవారం పలువురు సిద్దిపేటకు చెందిన వ్యాపారులు రూ.60వేల విరాళం అందజేశారు. సిద్దిపేటకు చెందిన వ్యాపారవేత్త చకిలం రవిభూషన్ రూ.50వేలు, గోవర్దన్, దొంతుల నర్సింగం, మహేశ్ కలిసి రూ.10వేలను విరాళంగా అందించారు. ఆ లయ అర్చకులు ప్రహ్లాదశర్మ, ఆలయ కమిటీ సభ్యులు ఓస రాజు, ఓస రవి తదితరులు పాల్గొన్నారు.

జీవన్‌రావ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న అభిమానులు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో సోమవారం జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ జీవన్‌రావు వర్ధంతి నిర్వహించారు. గ్రామస్తులు జీవన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీవన్‌రావు సోదరుడు నాగారావు, తిరుమలరావు, లింగారెడ్డి, నవీన్, గంగారాం, నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

సారంగాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సరోజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందని.. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరవాలని కోరారు.

పోలీసుల మానవత్వం



దుప్పటి, ఆహారం అందిస్తున్న పోలీసులు

ఖానాపూర్: రోడ్డు పక్కన చలితో వణుకుతున్న ఓ వృద్ధుడికి దుప్పటి, ఆహారం అందించి మానవత్వం చాటుకున్నారు పోలీసులు. సోమవారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న బ్లూకోట్, పెట్రోకార్ పోలీసు సిబ్బంది సతీశ్, సుధీర్ చలికి వణుకుతున్న వృద్ధుడికి ఆహారం అందించి అండగా నిలిచారు. వారిని సీఐ మోహన్‌తోపాటు ఎస్సై లింబాద్రి అభినందించారు.

'వాహనదారులు, డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి'

ఖానాపూర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రవేశపెట్టడంతో ఉపాధి కోల్పోయిన ప్రైవేట్ ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనదారులతోపాటు డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని నవయువ తెలంగాణ డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పానగంటి నరేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో వాహనదారులలు, డ్రైవర్లతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలతో నష్టపోతామని.. ప్రత్యేక చొరవ తీసుకుని తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాడెం రాకేశ్, విజయ్, కృష్ణ, రఘు తదితరులు ఉన్నారు.

ఆందోళనలో శనగ రైతులు

- పంటను తినేస్తున్న వేరుకుళ్లు పురుగు
- దుక్కి దున్ని మళ్లీ విత్తుకుంటున్న అన్నదాతలు
- పెట్టుబడులు రెండింతలయ్యాయని ఆవేదన



దార్‌కుభీర్‌లో మళ్లీ ట్రాక్టర్ ద్వారా శనగ విత్తనాలను విత్తుతున్న రైతు

కుభీర్‌లో పురుగు తినేసిన శనగ పంట చేను



కుభీర్: ఆరుగాలం కష్టించి పని చేసే రైతులను కష్టాలు వదలడం లేదు. కుభీర్ మండలంలోని పలు గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో శనగ పంటను సాగు చేశారు. కానీ పార్డి(బె), దార్‌కుభీర్, బెల్గాం, కుభీర్ తదితర గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో విత్తిన శనగ విత్తనాలను వేరుకుళ్లు పురుగు తినేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. దీంతో మళ్లీ దుక్కి దున్ని విత్తనాలు నాటేందుకు చేన్లను సిద్ధం చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు రెండింతలు పెరిగి తడిసి మోపెడవుతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు.

మళ్లీ విత్తుతున్న విత్తనాలు..

ఇప్పటికే శనగ పంటను సాగు చేసిన రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలు, భూమి దున్నినందుకు వేలాది రూపాయలు ఖర్చు చేశారు. కానీ మొలకెత్తిన విత్తనాలను వేరుకుళ్లు పురుగులు తినేయడంతో మళ్లీ దుక్కి దున్నడం, విత్తనాలను తెచ్చి డీఏపీ ఎరువుతోపాటు నాటుతున్నారు. స్థానిక ఫెర్టిలైజర్ దుకాణాల్లో శనగ విత్తనాలు దొరక్కపోవడంతో ఆర్థికంగా భారమైనా మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్, భైంసాకు వెళ్లి విత్తనాలను తెప్పించుకుంటున్నారు.

వ్యవసాయాధికారులు పరిశీలించాలి..

15 రోజుల శనగ పంటను పురుగు తినేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల చిరుజల్లులు కురువడం, నేలను తడిపి విత్తడంతో ఇలా అవుతుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనప్పటికీ వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి.. క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

ఏడెకరాల్లో పంట పోయింది..



రెండు క్వింటాళ్ల శనగ విత్తనాలు తీసుకొచ్చి ఏడెకరాల్లో విత్తాం. విత్తనాలు, ఎరువులకు కలిపి రూ.60వేలు ఖర్చయ్యాయి. పంటను మొత్తం పురుగు తినేసింది. మళ్లీ మరో రెండు క్వింటాళ్ల విత్తనం తీసుకొచ్చి విత్తాం. – బంక గంగాధర్, కుభీర్

రూ.50వేలు నష్టపోయా



ఐదకరాల్లో శనగ పంట వేయగా మొత్తం పురుగు తినేసింది. మళ్లీ భైంసాకు వెళ్లి విత్తనాలు తెచ్చి నాటా. సుమారు రూ.50వేలు నష్టపోయా. ప్రభుత్వం సర్వే చేసి శనగ రైతులను ఆదుకోవాలి. వ్యవసాయాధికారులు పరిశీలించి జాగ్రత్తలు చెప్పాలి. – భోజారాం, దార్‌కుభీర్

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం

కొందరు రైతులు తమ శనగ పంటను పురుగు తినేస్తుందని మా దృష్టికి తీసుకొచ్చారు. వేరుకుళ్లు పురుగు లార్వా దశలో మొలకలను తినేస్తుంది. 15 రోజుల పంటకు బెంజిమిన్‌వింటో మందును పిచికారీ చేయాలి. ఏఈవోలను పంట క్షేత్రాలకు పంపి సమస్య పరిష్కరిస్తాం. – వికారొద్దీన్, వ్యవసాయాధికారి, కుభీర్

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు



మాట్లాడుతున్న సీఐ పురుషోత్తం

నిర్మల్‌టౌన్: మైనర్ల చేతికి వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని నిర్మల్ పట్టణ సీఐ పురుషోత్తం అన్నారు. సోమవారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో వివిధ కారణాలతో 65 వాహనాలను, రిజిస్ట్రేషన్ లేని 10 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నంబర్ ప్లేట్లు తప్పుగా రాసినా.. విరగొట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

సిద్ధేశ్వరాలయంలో ఎమ్మెల్యే పూజలు



సిద్ధులకుంటలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నేతలు

సోన్: మండలంలోని సిద్దులకుంట గ్రామంలో ఉన్న సిద్ధేశ్వర ఆలయంలో సోమవారం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారి గ్రామానికి వచ్చినందుకు మహేశ్వర్‌రెడ్డికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, ఫణిందర్‌రావు, హరీశ్‌రెడ్డి, మార గంగారెడ్డి, నర్సారెడ్డి, చందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పరమేశ్వర్, మధుసూదన్‌రెడ్డి, ముత్యం తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన చామన్‌పెల్లి గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని నిర్మల్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా గెలిచినందుకు శుభాకాంక్షలు తెలిపి.. పూలమాల, శాలువాతో సన్మానించారు. అడ్వాల రమేశ్, ముత్యంరెడ్డి, వెంకట్‌రెడ్డి, రమణ, ప్రశాంత్‌రెడ్డి తదితరులున్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించేలా బోధించాలి



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ రాజేశ్

తానూరు: విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు బోధించాలని ఆంగ్ల భాషా రిసోర్స్‌పర్సన్ జి.రాజేశ్ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్వి స్కూల్ కాంప్లెక్స్‌లో కుభీర్, ముధోల్, తానూరు, బాసర మండలాల్లోని పాఠశాలల ఆంగ్లభాషా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు భూమన్నయాదవ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన హరినామ సప్తాహం



ప్రవచనాలు చెబుతున్న మహరాజ్



హాజరైన భక్తులు

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ గ్రామంలోని సిద్దేశ్వర ఆలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా పలువురు మహరాజ్‌లు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక సాధన అలవాటు చేసుకోవాలని సూచించారు. తులసీమాలలు ధరించి భక్తిమార్గంలో నడవాలన్నారు. పలువురు తులసీమాలలు స్వీకరించగా ఆలయంలో ఉట్టికొట్టి ప్రసాదం అందజేశారు. సప్తాహంలో పాల్గొన్న మహరాజ్‌లను ఆలయ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఏటా కార్తీకమాసంలో నిర్వహించే జాతరకు ఈసారి కూడా భక్తులు తరలివచ్చారు.

నదిలో ప్రత్యేక పూజలు, గంగాహారతి



ఉమ్మెడ ఉమామహేశ్వర ఆలయం వద్ద పూజలు చేస్తున్న బాలయోగి రాములు మహరాజ్



గంగా హారతి ఇస్తున్న వేదపండితులు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామ సమీపంలో నందిపేట్ మండలం ఉమ్మెడ ఉమామహేశ్వరాలయం వద్ద కార్తీక సోమవారం సందర్భంగా గోదావరి నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలయోగి రాములు మహరాజ్ చేతుల మీదుగా గంగాహారతి ఇచ్చారు. లోకేశ్వరం మండలం పంచగుడి, ధర్మోర, లోకేశ్వరం, వట్టోలి, పిప్రి, మొహల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నందిపేట్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు పోశెట్టి ప్రభాకర్‌రావు, నాయకులు జయసాగర్‌రావు, గంజాల గంగాధర్, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్, ఆనంద్‌రావు, భూమన్న, సాయన్న, పీరుపటేల్, సాయాగౌడ్, ఉమ్మెడ వీడీసీ సభ్యులు ఉన్నారు.

గెలిపించినందుకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



దస్తురాబాద్: పూజలో ఎమ్మెల్యే బొజ్జు

దస్తురాబాద్: తనపై నమ్మకంతో ప్రజలు గెలిపించినందుకు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రజాస్వామ్య పాలన సాధ్యమవుతుందన్నా రు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకముందు మండల కేంద్రంలోని గీతా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉపసర్పంచ్ గోపాల్ ఎమ్మెల్యేకు తులాభారం మొక్కు అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, పలువురు నాయకులు భూమన్న, దశరత్, నాగన్న, రాజేందర్, శ్రీనివాస్, కుమార్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

కడెం: హైదరాబాద్‌లో ప్రమాణస్వీకారం అనంతరం ఉట్నూర్‌కు వచ్చిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును సోమవారం ఎంపీపీ అలెగ్జాండర్, కన్నాపూర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, తక్కల్ల సత్తెన్న మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా బొజ్జుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

'ఆదర్శ' వసతిగృహం తనిఖీ

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని సోమవారం అధికారులు లక్ష్మణ్, సంధ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, మౌలిక వసతులు, రికార్డులను పరిశీలించి సంతృప్తి చేశారు. వారి వెంట కస్తూర్బా ఎస్‌వో సువర్ణ తదితరులు ఉన్నారు.

తెలుగు ఉపాధ్యాయులకు సమావేశం

కుంటాల: మండల కేంద్రలోని ఉన్నత పాఠశాలలో సోమవారం లోకేశ్వరం, కుంటాల, భైంసా మండలాల పాఠశాలల్లోని తెలుగు బోధకులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. వందేమాతరం ప్రాధాన్యత, విద్యార్థులకు చెప్పే బోధనా అంశాలపై చర్చించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, సగ్గం గంగాధర్, శిక్షకులు రావుల గంగన్న, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ సప్తాహం



శోభాయాత్రలో గ్రామస్తులు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో సోమవారం హనుమాన్ సప్తాహం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో పూజల అనంతరం ప్రతిమను వీధుల గుండా శోభాయాత్ర చేశారు. ఏడు రోజులపాటు సాగిన సప్తాహ వేడుకలు సోమవారం ముగిశాయి. అనంతరం వీడీసీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సర్పంచ్ శేఖర్‌రెడ్డి, భోజన్న, బద్దం గంగారెడ్డి, గంగాధర్‌పటేల్, పృథ్వీ, మహేందర్‌రెడ్డి, అనిల్, భోజారాం తదితరులున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో వడ్లూరి శ్రీనివాస్ అనే అయ్యప్ప భక్తుడి నివాసంలో సోమవారం పదునెట్టంబడి మహాపడిపూజ మహోత్సవం నిర్వహించారు. గురుస్వామి పిపుపాటి పాపారావు ఆధ్వర్యంలో స్వామివారిని పంచామృతాలతో అభిషేకించారు. కర్పూర హారతులు, మెట్లపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పడిపూజకు స్వాములు, భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



శ్రీహరిరావుతో సిబ్బంది

లక్ష్మణచాంద: తమ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని రాచాపూర్ జ్యోతిబాపూలే పాఠశాల (బాలురు), కళాశాల సిబ్బంది డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు విన్నవించారు. సోమవారం జిల్లా కేంద్రంలో శ్రీహరిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా అతిథి అధ్యాపకులుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామని.. తమకు ఉద్యోగ భద్రత కల్పించి 12 నెలల వేతనం ఇప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు సిబ్బంది తెలిపారు.

సన్మానం

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన భూమన్న యాదవ్‌ను ఆంగ్లభాషా ఫోరం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సన్మానించారు. ఆంగ్ల భాషా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేశ్, జి.రాజేశ్, సుజాతదేవి తదితరులు ఉన్నారు.

మహాలక్ష్మి కష్టాలు





బస్టాండ్‌లో బస్సులో సీటు కోసం పురుషుల పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో పలువురికి ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం నిర్మల్ బస్టాండ్ మహిళా ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. పురుషులు బస్సు ఎక్కేందుకు సర్కస్ ఫీట్లు చేయాల్సి వచ్చింది. మహిళా కండక్టర్లు సైతం తోసుకుంటూ వెళ్లి టికెట్ ఇచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. బస్సులో ఖాళీ లేక వారు కూడా ఫుట్‌బోర్డుపైనే ప్రయాణించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్





బస్సులో స్థలం లేక ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేస్తున్న మహిళా కండక్టర్లు

ప్రజాఫిర్యాదుల విభాగం

కుంటాల: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అధికారులు ప్రజా ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేశారు. ఒక్క దరఖాస్తు కూడా అందలేదని అధికారులు తెలిపారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం తదితరులున్నారు.